సూర్య www.suryaa.com
19వ వసంతంలోకి..
www.suryaepaper.com

EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4PM www.suryaa.com
ఆదివారం
15-02-2026
పేజీలు: 02



## తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ

ఆపదమొక్కులవాడు వేంకటేశ్వరస్వామి కొలువుదీరిన తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో 31 కంపార్టుమెంట్లు నిండి ఏటీజీహెచ్ వరకు క్యూలైన్లో నిలబడ్డారు. టోకెన్లు లేని భక్తులకు 12 గంటల్లో సర్వదర్శనం అవుతుందని టీటీడీ అధికారులు వివరించారు. నిన్న స్వామివారిని 82,337 మంది భక్తులు దర్శించుకోగా 30,825 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు చెల్లించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 3.58 కోట్లు ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు.



## వేములవాడలో వైభవంగా మహాశివరాత్రి వేడుకలు

వేములవాడ రాజన్న క్షేత్రంలో మహాశివరాత్రి వైభవంగా కొనసాగుతుంది. రాజన్న ఆలయం మూసివేసి ఉండడంతో భక్తులు పెద్ద ఎత్తున ఆలయం వద్దకు చేరుకొని కొబ్బరికాయలు కొట్టి స్వామివారిని బయట నుండే మొక్కి వెను తిరుగుతున్నారు. మరోవైపు భీమేశ్వరాలయంలో దర్శనాలు కొనసాగుతుండగా వేకువజామున దర్శనానికి భక్తుల రద్దీ అత్యంత సర్వసాధారణంగా ఉంది. స్వామివారికి అత్యంత ప్రతిపాదనమైన కోడె మొక్కులు చెల్లించుకుని భక్తులు తరిస్తున్నారు.

**మహాశివరాత్రి.. భక్తులతో కిటకిటలాడుతున్న శివాలయాలు**

మహాశివరాత్రి సందర్భంగా తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ శివాలయాలు భక్తుల రద్దీతో కిటకిటలాడుతున్నాయి. ఆలయాల్లో పరమశివుడిని కొలుస్తూ రుద్రాభిషేకాలు చేస్తున్నారు. వేకువ జామున 4 గంటల నుంచి భక్తులు ఆలయాల్లో దీపాలు వెలిగించి గరలకంఠుడికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. యాదగిరిగుట్ట, ఝురాసంగం, వేములవాడ రాజన్న, కీసర, కాళేశ్వరం, వరంగల్ వేయిస్తంబాల ఆలయాల్లో 'ఓం నమఃశివాయ' స్మరణతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. ఇక హైదరాబాద్‌లోని శైవ క్షేత్రాలకు భక్తులు క్యూకట్టారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తున్నారు. భక్తుల రద్దీతో క్యూలైన్లు నిండిపోయాయి.

### కరీంనగర్ కార్పొరేషన్‌లో టెన్షన్..

# క్యాంపుల్లో కార్పొరేటర్లు




కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ లో మేయర్ ఎన్నిక తీవ్ర ఉత్కంఠగా మారింది. ఇక్కడ ఎవరికీ మ్యాజిక్ ఫిగర్ రాలేదు. 30 సీట్లతో అతిపెద్ద పార్టీగా బీజేపీ అవతరించింది. మొత్తం 66 సీట్లు ఉన్న కరీంనగర్ లో.. మ్యాజిక్ ఫిగర్ 34. బీజేపీకి ఇంకో నలుగురు అవసరం ఉంది. అటు కాంగ్రెస్ కు 14 స్థానాలు రాగా, బీఆర్ ఎస్ నుంచి 9 మంది గెలిచారు. ఎంఐఎం నుంచి ముగ్గురు, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి ఇద్దరు, ఇండిపెండెంట్లు 8 స్థానాల్లో విజయం సాధించారు. ఇందులో ఒకరు బీఆర్ ఎస్ రెబల్ గా పోటీ చేశారు. ఎవరికీ మ్యాజిక్ ఫిగర్ రాకపోవడంతో అన్ని పార్టీలు క్యాంపు రాజకీయాలకు తెర తీశాయి. బీజేపీ నుంచి గెలిచిన 30 మందితో పాటు 13వ డివిజన్ ఇండిపెండెంట్ కార్పొరేటర్ తెల్ల లక్ష్మి, 17వ డివిజన్ ఇండిపెండెంట్ కార్పొరేటర్ వేముల కవిత-చంద్రశేఖర్, 15వ డివిజన్ ఏఐఎఫ్ బీ కార్పొరేటర్ విపల సాయిజ్యోతి, 39వ డివిజన్ ఇండిపెండెంట్ కార్పొరేటర్ మాసం గణేశ్ ఇప్పటికే కేంద్రమంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. దీంతో బీజేపీ సంఖ్య 34కు చేరింది. వీరందరినీ హైదరాబాద్ శివారులోని బీజేపీ క్యాంపునకు తరలించారు. బండి సంజయ్ కు ఎక్స్ అఫిషియో ఓటు ఉండటంతో బీజేపీ సంఖ్య 35కు చేరింది. అయితే అటు కాంగ్రెస్ కూడా తమకు సంఖ్యాబలం ఉందని చెబుతోంది. కరీంనగర్ కార్పొరేషన్ ను దక్కించుకునే బాధ్యతను మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ లకు అప్పగించింది పార్టీ అధిష్టానం. దీంతో వారిద్దరూ ఇప్పటికే కరీంనగర్ చేరుకున్నారు. ఇండిపెండెంట్లు, ఇతర పార్టీల కార్పొరేటర్లతో చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. కాంగ్రెస్ కు ఇంకా 20 మంది కార్పొరేటర్లు కావాలి. ఎక్స్ అఫిషియో ఓట్లతో చూసినా బలం సరిపోదు. అటు బీఆర్ ఎస్ నుంచి గెలిచిన 9 మందితో పాటు రెబల్ గా గెలిచిన ఇండిపెండెంట్ అభ్యర్థి కూడా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆధ్వర్యంలోనే ఉన్నారు. వాళ్లెవరూ పార్టీ మారబోరని.. ఎవరికీ మద్దతు ఇవ్వరని బీఆర్ ఎస్ చెబుతోంది. అటు ఎంఐఎం కాంగ్రెస్ కు మద్దతు తెలుపుతుందా లేదా అనేది ఇంకా తెలియదు. బీజేపీకి సరిపడా సంఖ్యా బలం ఉండటం వల్ల.. ఆ పార్టీకే కార్పొరేషన్ దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరి ఎప్పుడు ఏం జరుగుతుందో వేచి చూడాలి.

**కరీంనగర్ మేయర్ సీటుపై మంత్రి పొన్నం కీలక వ్యాఖ్యలు**

కరీంనగర్ మేయర్ సీటుపై మంత్రి పొన్నం ప్రభాకర్ హాట్ కామెంట్స్ చేశారు. కాంగ్రెస్ పార్టీ మేయర్ సీటు రేసులో ఉందని, ఇంకా ప్రయత్నాలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. మహా శివరాత్రి సందర్భంగా మంత్రి పొన్నం నేడు ఉదయం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి వేములవాడ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ మేయర్ పీఠం కోసం ప్రయత్నిస్తోందని చెప్పారు. పొత్తులపై స్పందిస్తూ తమది రాజకీయ పార్టీ అని, తప్పకుండా చివరి వరకు రాజకీయం చేస్తామని స్పష్టం చేశారు. కరీంనగర్ మేయర్ సీటు దక్కించుకుంటామనే నమ్మకం ఉందని పొన్నం వ్యాఖ్యానించారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో ఏం జరుగుతుందన్నది రేపటి వరకు వేచి చూడాలని చెప్పారు.



## ప్రధాని మోదీకి బంగ్లా సర్కారు ఆహ్వానం

బంగ్లాదేశ్ లో కొత్త ప్రభుత్వం కొలువుదీరబోతున్నది. ఈ నెల 17న బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ అధ్యక్షుడు తారిఖ్ రెహ్మాన్ ప్రధానిగా ప్రమాణస్వీకారం చేయబోతున్నారు. ఈ ప్రమాణస్వీకారానికి రావాలని ప్రధాని నరేంద్ర మోదీ కి ఆహ్వానం అందింది. ఈ మేరకు బంగ్లాదేశ్ ప్రభుత్వం ఆహ్వానం పంపింది. కాగా ఇటీవల జరిగిన బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో బీఎన్‌పీ ఘన విజయం సాధించింది. దాంతో తారిఖ్ రెహ్మాన్ ప్రమాణస్వీకారానికి ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని బంగ్లాదేశ్ పార్లమెంట్ హౌస్‌లోని సదరన్ ప్లాజాలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలని యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం 13 దేశాలకు ఆహ్వానాలు పంపించింది.



### బంజారాలకు మరింత అండగా నిలబడతాం..

## సేవాలాల్ జయంతిలో కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. సేవాలాల్ జయంతి ఉత్సవాలను జరుపుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. గిరిజనుల ఆత్మగౌరవానికి న్యాయం చేసిన నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. లంబాడా తండాలను గ్రామ పంచాయితీలుగా చేసింది కేసీఆర్ అని చెప్పారు. 3146 కొత్త గ్రామ పంచాయితీలను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. ఇప్పుడు 3146 మంది గిరిజన బిడ్డలు సర్పంచ్‌లు అయ్యారని తెలిపారు. గిరిజన తండాల్లో ఇంటింటికీ నీటి వసతి కల్పించామని పేర్కొన్నారు. నాలుగున్నర లక్షల ఎకరాలకు కేసీఆర్ ఒకే రోజు పోడు పట్టాలిచ్చారని అన్నారు. గిరిజన బిడ్డల విద్య కోసం వందలాది గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశామని తెలిపారు.

### ఆధార్ కార్డుల రూపురేఖలు మార్చేందుకు

## యూఐడీఏఐ సన్నాహాలు





దేశవ్యాప్తంగా కోట్లాది మంది గుర్తింపు కార్డుగా మారిన ఆధార్ కార్డు స్వరూపంలో భారీ మార్పులు రాబోతున్నాయి. ఆధార్ కార్డు ఫోటోకాపీల ద్వారా జరుగుతున్న మోసాలు, వ్యక్తిగత సమాచార దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ ఈ కీలక మార్పులను ప్రతిపాదించింది. ఈ కొత్త విధానం అమల్లోకి వస్తే, భౌతిక ఆధార్ కార్డుపై ఇకపై వ్యక్తిగత వివరాలు కనిపించవు. ప్రస్తుతం మనం బ్యాంకు ఖాతా తెరిచేందుకు, సిమ్ కార్డు కొనుగోలు చేసేందుకు, ప్రభుత్వ పథకాలు పొందేందుకు ఆధార్ కార్డు ఫోటోకాపీలను ఇస్తున్నాం. ఈ కార్డులపై 12 అంకెల ఆధార్ నంబర్‌తో పాటు పేరు, పుట్టిన తేదీ, చిరునామా వంటి అత్యంత సున్నితమైన సమాచారం ముద్రించి ఉంటోంది. ఈ ఫోటోకాపీలు నేరగాళ్ల చేతికి చిక్కితే గుర్తింపు చోరీ (ఐడెంటిటీ థెఫ్ట్), ఆర్థిక మోసాలు జరిగే ప్రమాదం ఎక్కువగా ఉందని యూఐడీఏఐ గుర్తించింది.ఈ సమస్యను అధిగమించేందుకు, కొత్తగా జారీ చేయబోయే ఆధార్ కార్డులపై కేవలం కార్డుదారుడి ఫోటో, ఒక ప్రత్యేకమైన ఎన్‌క్రిప్టెడ్ క్యూఆర్ కోడ్ మాత్రమే ప్రదర్శించాలని యూఐడీఏఐ యోచిస్తోంది. ఆధార్ నంబర్, చిరునామా వంటి వివరాలన్నీ ఈ క్యూఆర్ కోడ్‌లో భద్రంగా నిక్షిప్తమై ఉంటాయి. గుర్తింపు ధృవీకరణ అవసరమైనప్పుడు, సంబంధిత సంస్థలు తమ వద్ద ఉన్న అధీకృత యాప్‌ల ద్వారా ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి వివరాలను సరిచూసుకుంటాయి. దీనివల్ల కేవైసీ ప్రక్రియ వేగవంతం అవ్వడమే కాకుండా, వ్యక్తిగత సమాచారానికి పూర్తి భద్రత లభిస్తుంది.గత ఏడాది నుంచే ఈ మార్పులపై కసరత్తు జరుగుతోందని, త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడవచ్చని తెలుస్తోంది. ఆధార్ ఫోటోకాపీల ద్వారా జరిగే దుర్వినియోగాన్ని అరికట్టేందుకు కొత్త నిబంధనలు తీసుకొస్తున్నామని యూఐడీఏఐ సీఈవో భువనేశ్ కుమార్ ఇటీవలే ఒక సమావేశంలో స్పష్టం చేశారు. ఇటీవల విడుదల చేసిన కొత్త ఆధార్ మొబైల్ యాప్‌లో కూడా లాగిన్ అయిన తర్వాత కేవలం ఫోటో, క్యూఆర్ కోడ్ మాత్రమే కనిపించేలా మార్పులు చేసిన విషయం తెలిసిందే. ఈ ప్రతిపాదన అమలైతే ఆధార్ గోప్యత మరింత పటిష్ఠం అవుతుందని, మోసాలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడుతుందని సాంకేతిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### విజువల్ వండర్‌గా

## నాగబంధం టీజర్


పెదకాపు ఫేమ్ విరాట్ కర్ణ హీరోగా వస్తున్న లేటెస్ట్ మూవీ నాగబంధం. డివోషనల్ కంటెంట్ తో భారీ విజువల్స్ తో వస్తున్న ఈ సినిమాను అభిషేక్ నామ తెరకెక్కిస్తున్నాడు. తాజాగా మహా శివరాత్రి సందర్భంగా నాగబంధం సినిమా టీజర్ విడుదల చేశారు మేకర్స్. ఈ టీజర్ ను సూపర్ స్టార్ మహేష్ బాబు సోషల్ మీడియాలో విడుదల చేశారు. టీజర్ లో విజువల్స్ నెక్స్ట్ లెవల్లో ఉన్నాయి. ప్రెజెంట్ జనరేషన్ కి శివతత్వానికి లింక్ చేస్తూ వచ్చిన ఈ టీజర్ మైండ్ బ్లాంక్ చేసింది అనే చెప్పాలి. పురాతనమైన రహస్యాలు, ట్రెజర్ హంట్, నాగబంధనం లాంటి కథతో ఈ సినిమా రానుంది. ఇక శివుడిగా విరాట్ కర్ణ లుక్ అదిరిపోయింది అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ ఒక్క టీజర్ సినిమాపై అంచనాలను ఒక రేంజ్ లో పెంచేసింది. ఇప్పటికే దాదాపు షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ సినిమా త్వరలోనే థియేటర్స్ లోకి రానుంది. ఇక నాగబంధం సినిమాలో జగపతి బాబు, నభా నటేశ్, ఐశ్వర్యా మేనన్ కీలక పాత్రల్లో కనిపిస్తున్నారు. ఈ చిత్రాన్ని రూపొంది స్తున్నారు. ఈ వేసవిలో విడుదల కానుంది.





## సిద్ధరామయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన డీకే శివకుమార్

కర్ణాటక రాజకీయాల్లో డీకే శివకుమార్, సిద్ధరామయ్య మధ్య సీఎం పదవి కోసం గత కొంత కాలంగా ఒక రకమైన పోటీ నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో, తాజాగా ఓ ఆశ్చర్యకరమైన సంఘటన చోటుచేసుకుంది. కర్ణాటకలోని హావేరీలో జరిగిన భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నిలువెత్తు విగ్రహాన్ని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్వయంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ద్వారా ఇద్దరి మధ్య ఆధిపత్య పోరు ఉందనే ప్రచారానికి పూర్తి చెక్ పెట్టినట్లు కనిపిస్తోంది. సిద్ధరామయ్య నాయకత్వంలో కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ విగ్రహావిష్కరణ జరిగింది. పార్టీలో ఐక్యతను, సమష్టి కృషిని ప్రజలకు చాటడమే ఈ కార్యక్రమం లక్ష్యమని డీకే శివకుమార్ స్పష్టం చేశారు. గ్యారంటీ పథకాల అమలులో సిద్ధరామయ్య పోషించిన పాత్రను కొనియాడుతూ, ఆయన చరిత్రలో ప్రజా నాయకుడిగా నిలిచిపోతారని అన్నారు. విగ్రహాన్ని ఆవిష్కరించిన తర్వాత సిద్ధరామయ్యకు డీకే శివకుమార్ ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇద్దరూ ఒకే వేదికపై కనిపించడం, ఒకరినొకరు గౌరవించడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. సిద్ధరామయ్య సైతం తన విగ్రహాన్ని డీకే ఆవిష్కరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇది తన వ్యక్తిగత గౌరవం మాత్రమే కాదు, కాంగ్రెస్ పార్టీ సమష్టి కృషికి దక్కిన గుర్తింపని ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి పదవి రేసులో ఎప్పుడూ పోటీపడే ఈ ఇద్దరు నేతల మధ్య ఇలాంటి ఐక్యతను చూపడం రాష్ట్ర రాజకీయాలకు కొత్త సంకేతంగా మారింది. ఈ విగ్రహావిష్కరణ పార్టీలో ఐక్యతను బలపరిచినట్లు కనిపిస్తోంది.



నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM





ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహాశివరాత్రి సందర్భంగా భక్తులు సంగం - గంగా, యమున మరియు పౌరాణిక సరస్వతి సంగమం వద్ద పవిత్ర స్నానాలు ఆచరించి ప్రార్థనలు చేస్తున్నారు.







## రష్యా చమురు కొనుగోళ్లు.. కేంద్రమంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు

రష్యా నుంచి చమురు కొనుగోలుకు సంబంధించి కేంద్ర మంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇంధన కొనుగోళ్ల విషయంలో రాజకీయ ఒత్తిళ్లు పని చేయవని ఆయన స్పష్టం చేశారు. అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ నిలిపివేసిందంటూ అమెరికా ప్రకటించింది. ఈ నేపథ్యంలో జైశంకర్ స్పందించారు. ఇంధన కొనుగోళ్ల అంశం జాతీయ ప్రయోజనాలపై ఆధారపడి ఉంటుందని అన్నారు. జర్మనీలోని మ్యూనిచ్ భద్రతా సమావేశంలో పాల్గొన్న ఆయన ఓ ప్రశ్నకు బదులిస్తూ, చమురు కొనుగోళ్ల విషయంలో భారత్ చాలా స్వతంత్రంగా వ్యవహరిస్తుందని ఆయన తెలిపారు. భారత్ తన వ్యూహాత్మక ప్రయోజనాలకు కట్టుబడి ఉందని అన్నారు. ఇంధన సమస్యల విషయానికి ప్రస్తుతం మార్కెట్ సంక్లిష్టంగా ఉందని వెల్లడించారు. చమురు కొనుగోళ్లకు సంబంధించి భారత్‌లోని కంపెనీలు యూరోప్‌తో సహా ప్రపంచంలోని ఇతర ప్రాంతాలను పరిశీలిస్తాయని అన్నారు. ఖర్చులు, నష్టాలు, లభ్యతను చూసి వారి ప్రయోజనాలకు తగినట్లు కొనుగోళ్లు జరుపుతారని వెల్లడించారు.



## మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన గొర్రెలకాపరి నాగమ్మ

జీవితం ఎప్పుడైనా మారిపోవచ్చనేదానికి ఇది మరో ఉదాహరణ. ఏమాత్రం చదువు లేని ఒక అమాయకురాలు ఊహించని విధంగా ప్రజాప్రతినిధి అయిపోయింది. వివరాల్లోకి వెళితే... నారాయణపేట మున్సిపాలిటీ పరిధిలో ఉండే బొడ్డేమొల్ల నాగమ్మ ప్రకృతిని నమ్ముకుని బతుకుతున్న ఒక సాధారణ గృహిణి. ఆమెకు చదువు లేదు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అసలు తెలియదు. గొర్రెలను పెంచుతూ జీవనోపాధిని పొందుతున్న సామాన్యురాలు. కానీ, ఆమెను అదృష్టం వెతుక్కుంటూ వచ్చింది. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో నారాయణపేట మున్సిపాలిటీలో 19వ వార్డు నుంచి పోటీ చేయాలంటూ పట్టణ బీజేపీ నాయకత్వం ఆమెకు అవకాశం ఇచ్చింది. రాజకీయాలు తెలియని ఆమె... ధైర్యంగా తన భర్త అండతో ఎన్నికల బరిలోకి దిగింది. భర్తతో పాటు, వార్డులో ఉన్న యువత సహకారంతో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేసింది. తనను గెలిపిస్తే గృహిణులకు, వ్యవసాయదారులకు బీజేపీ తరపున అండగా ఉంటానని... అందరి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇస్తూ ప్రచారం చేసింది. చివరకు ఎన్నికల్లో ఆమె జయకేతనం ఎగురవేసింది. తన ప్రత్యర్థి సరిత సతీశ్ గౌడ్ పై 154 ఓట్ల మెజార్టీతో 19వ వార్డు కౌన్సిలర్ గా గెలుపొందింది. ఎన్నికల్లో గెలుపొందిన నాగమ్మను ఇతర పార్టీల నేతలు కూడా అభినందిస్తున్నారు.

## ఆ 4 మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ డీలా....
# ఒక్క వార్డు కూడా గెలవలేదు

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ సత్తా చాటింది. సంపూర్ణమైన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. మున్సిపాలిటీల్లోని 2581 వార్డులకు గాను.. కాంగ్రెస్ 1347 చోట్ల సత్తా చాటింది. బీఆర్ఎస్‌కు 716, బీజేపీకి 261 వార్డులు మాత్రమే దక్కాయి. మొత్తం 414 డివిజన్లలో కాంగ్రెస్‌కు 190, బీజేపీకి 75, బీఆర్ఎస్‌కు 60 డివిజన్లు దక్కాయి. మొత్తంగా 66 మున్సిపాలిటీలను కాంగ్రెస్ కైవసం చేసుకోగా.. బీఆర్ఎస్ 13 స్థానాలను మాత్రమే పరిమితమైంది. నాలుగు మున్సిపాలిటీల్లో అయితే ఆ పార్టీ ఖాతా కూడా తెరవలేదు. ఒక్కటంటే ఒక్క వార్డును కూడా గెలుచుకోలేకపోయింది. భైంసా, కోస్గి, మక్తల్, ధర్మపురి మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ పార్టీకి సున్నా వార్డులు వచ్చాయి. ధర్మపురిలో మొత్తం 15 వార్డులు ఉండగా.. అన్నింటినీ అధికార కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. కోస్గిలోనూ 16 స్థానాలు ఉండగా మొత్తం కాంగ్రెస్ ఖాతాలోనే చేరాయి. ఇక మరో 13 మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ సింగిల్ డిజిట్‌కు మాత్రమే పరిమితమైంది. మంథని, మధిర, కొడంగల్,



హాలియా, చొప్పదండి, భూత్పూర్, ఎల్లారెడ్డి, యాదగిరిగుట్ట, వడ్డేపల్లి, సుల్తానాబాద్, పెద్దపల్లి, నందికొండ, ఆత్మకూరు మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఒక్కో వార్డులో మాత్రమే విజయం సాధించారు. ఇక 36 మున్సిపాలిటీల్లో ఏ పార్టీకి పూర్తి మెజారిటీ రాలేదు. దీంతో అక్కడ హంగ్ ఏర్పడింది. మహబూబ్‌నగర్ జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత మద్దతుతో పోటీ చేసిన ఆల్ఇండియా ఫార్వర్డ్‌బ్లాక్ అభ్యర్థులు కైవసం చేసుకున్నారు. ఇక జగిత్యాలలో కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్‌రెడ్డి మద్దతుదారులు స్వతంత్రులుగా పోటీ చేసి అత్యధిక స్థానాల్లో విజయం సాధించారు. ఇక్కడ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన డాక్టర్ సంజయ్ వర్గానికి కాంగ్రెస్ టికెట్లు కేటాయించగా.. జీవన్ రెడ్డి మద్దతుదారులు ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగి అత్యధిక స్థానాలను కైవసం చేసుకున్నారు. కాగా, ఈనెల 16న నగరపాలికల్లో మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపాలిటీల్లో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక జరగనుంది. చేతులెత్తే విధానంలో ఈ ఎన్నికలు జరగనుండగా.. పలు చోట్ల హంగ్ ఏర్పడటంతో ఈ ఎన్నికలు కూడా రసవత్తరంగా మారాయి. ఇప్పటికే అన్ని పార్టీలు గెలిచిన అభ్యర్థులను క్యాంపులకు తరలించాయి.

## ఏపీ బడ్జెట్‌ను 360 సమతుల్య గ్రోత్ మోడల్‌గా
# అభివర్ణించిన పవన్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రశంసలు కురిపించారు. రూ.3,32,205 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన ఈ బడ్జెట్, రాష్ట్రాన్ని 360 డిగ్రీల కోణంలో సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు బలమైన పునాది వేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షిస్తున్న 'వికసిత్ భారత్ 2047'లో ఏపీని కీలక భాగస్వామిని చేస్తుందని, 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్యాన్ని చేరుకునేలా నడిపిస్తుందని పవన్ కల్యాణ్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ బడ్జెట్ ఒక సమతుల్య గ్రోత్ మోడల్‌గా రూపుదిద్దుకుందని పవన్ కల్యాణ్ కొనియాడారు. గ్రామం నుంచి గ్లోబల్ స్థాయి వరకు విద్య, ఆరోగ్యం, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, యువత, మహిళా సాధికారత, సాంకేతికత వంటి అన్ని రంగాలను ముందుకు తీసుకెళ్లేలా ఈ బడ్జెట్ ఉందని అన్నారు. సంక్షేమంతో కూడిన అభివృద్ధి ఫలాలను సమాజంలోని అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యతతో అందించాలనే లక్ష్యం ఇందులో స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు.ముఖ్యంగా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు ఏకంగా రూ.22,942 కోట్లు కేటాయించడం శుభపరిణామమని పవన్ అన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో గ్రామాలే కీలకమనే విషయాన్ని ఎన్డీయే ప్రభుత్వం మరోసారి చాటిచెప్పిందని



తెలిపారు. ఈ కేటాయింపులతో గ్రామీణ మౌలిక సదుపాయాలు, రహదారుల నిర్మాణం, ఇంటింటికీ సురక్షిత తాగునీటి సరఫరా, ఉపాధి అవకాశాల కల్పనతో పాటు స్థానిక పాలనను బలోపేతం చేసి గ్రామాల ఆర్థిక పరిపుష్టికి దోహదపడతాయని వివరించారు.అదేవిధంగా పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖకు రూ.714 కోట్లు కేటాయించడం ద్వారా 'హరిత ఆంధ్రప్రదేశ్' లక్ష్య సాధన పట్ల ప్రభుత్వ నిబద్ధత స్పష్టమవుతోందని పవన్ కల్యాణ్ తెలిపారు. 2030 నాటికి 37 శాతం, 2047 నాటికి 50 శాతం గ్రీన్ కవర్ సాధించే దిశగా ఈ నిధులు ఉపయోగపడతాయని, అటవీ సంపద, వన్యప్రాణుల సంరక్షణకు మరింత చేయూత లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమగ్ర బడ్జెట్‌ను రూపొందించిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడులకు ఆయన మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేశారు.

## 60 ఏళ్ల జగపతి బాబు ఫిట్‌నెస్ రహస్యం ఇదే!



ఒకప్పుడు ఫ్యామిలీ హీరోగా గుర్తింపు పొందిన జగపతి బాబు, ఇప్పుడు స్టైలిష్ విలన్‌గా ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. 60 ఏళ్లు దాటినా ఆయన ఫిట్‌గా ఉండటానికి గల సీక్రెట్ ను పంచుకున్నారు. ఆహారపు అలవాట్లు, క్రమం తప్పని వ్యాయామం, మనసును ప్రశాంతంగా ఉంచుకోవడం వల్లే ఇది సాధ్యమని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. అనవసరమైన ఆలోచనలను పక్కన పెట్టి, ప్రస్తుత క్షణంలో జీవించడమే తన ఫిట్‌నెస్ రహస్యమని తెలిపారు. ఒకప్పుడు ఫ్యామిలీ హీరోగా ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకున్న జగపతి బాబు కెరీర్‌లో, ఒకానొక దశ తర్వాత ఆయన ఆర్థికంగా ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నారు. నిజానికి 'లెజెండ్' సినిమాతో ఆయన విలన్‌గా మారడం తన జీవితంలో అతిపెద్ద మలుపుగా జగపతి బాబు చెబుతుంటారు. హీరోగా ఉన్నప్పుడు రాని గుర్తింపు, విలన్‌గా మారిన తర్వాత విభిన్న పాత్రల ద్వారా లభిస్తోందని ఆయన పలు ఇంటర్వ్యూలలో వెల్లడించారు. ప్రస్తుతం ఈ స్టైలిష్ విలన్ తన సెకండ్ ఇన్నింగ్స్‌లో సూపర్ హిట్స్ రోల్స్‌తో సక్సెస్‌ఫుల్‌గా దూసుకుపోతున్నారు.

## తెలంగాణకు కేంద్రం నుంచి మరో శుభవార్త

తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం మరో శుభవార్త అందించింది. రాష్ట్రంలో మరో కొత్త నేషనల్ హైవే నిర్మించేందుకు సిద్ధమైంది. మహబూబ్‌నగర్ నుంచి కర్ణాటక సరిహద్దులోని గుడబెళ్లూరు వరకు ఈ కొత్త జాతీయ రహదారి ఉండనుంది. ఈ ప్రాజెక్ట్ చేపట్టేందుకు కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ తాజాగా లభించింది. శనివారం ప్రధాని మోదీ అధ్యక్షతన కీలక కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నా. ఈ కేంద్ర మంత్రివర్గ సమావేశంలో మహబూబ్‌నగర్-గుడబళ్లూరు కొత్త నేషనల్ హైవే నిర్మాణానికి అనుమతి ఇవ్వడంతో పాటు నిధుల మంజురుకు కూడా ఆమోదం తెలిపారు. ఈ రెండు ప్రాంతాల మధ్య నాలుగు లైన్ల హైవే నిర్మించనుండగా.. ఇందుకోసం తొలి విడతగా రూ.3 వేల కోట్ల నిధులు విడుదల చేసేందుకు ఆమోదం తెలిపారు. హైదరాబాద్-గోవా ఎకనామిక్ కారిడార్‌లో ఈ కొత్త జాతీయ రహదారి ఉండనుంది. దీంతో హైదరాబాద్ నుంచి గోవాకు రోడ్డు మార్గంలో వెళ్లేవారికి ప్రయాణ సమయం భారీగా తగ్గనుంది. రాయచూర్, మంత్రాలయం మీదుగా ఈ హైవే ఉంటుంది. 80.01 కిలోమీటర్ల హ్యామ్ విధానంలో నిర్మించనున్నారు. మహబూబ్‌నగర్ నుంచి హైవే మొదలుకానుండగా.. దేవరకద్ర, మరకిల్, మఖ్తల్, మాగునూర్ మీదుగా రాయచూరు సరిహద్దుల వరకు వెళుతుంది. నేషనల్ హైవే పక్కన ప్రత్యేక బైపాస్‌లు కూడా నిర్మించనున్నారు. దీని వల్ల వాహనదారులకు మరింత సౌకర్యవంతంగా ఉంటుందని చెప్పవచ్చు. మాగనూరు, మరకిల్, ముఖ్తల్, మహబూబ్ నగర్, దేవరకద్ర వద్ద ఈ బైపాస్‌లు ఉంటాయి. దీంతో ఆ పట్టణాల ప్రజలకు ప్రయాణ సౌకర్యం కల్పిస్తారు.

## MPTC, ZPTC ఎన్నికలపై సీఎం కీలక చర్చ

పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల ప్రాసెస్ ముగిసిపోవడంతో ఇకపైన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను నిర్వహించేలా ప్రభుత్వం ఆలోచిస్తున్నది. పండగలు, పరీక్షలు, బడ్జెట్ సమావేశాలు.. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని ఎన్నికల నిర్వహణకు ఎప్పుడు అనుకూలంగా ఉంటుందనే అంశంపై మంత్రుల అభిప్రాయాలను తీసుకున్నారు. మున్సిపాలిటీలకు చైర్‌పర్సన్, వైస్ చైర్ పర్సన్, మున్సిపల్ కార్పొరేషన్లకు మేయర్ల ఎన్నిక ఎల్లుండి జరగనున్నందున ఎక్కడెక్కడ పార్టీకి ఎలాంటి ఇబ్బందులున్నాయో కూడా ఆరా తీశారు. స్వతంత్ర అభ్యర్థులు, రెబల్ క్యాండిడేట్స్ నుంచి మద్దతు పొందడంపైనా చర్చించినట్లు తెలిసింది. మున్సిపల్ ఎన్నికల ఫలితాలను ప్రస్తావిస్తూ ఏయే ఎంపీ సెగ్మెంట్‌లో ఎలాంటి అనుకూల, ప్రతికూల పరిస్థితులు ఉన్నాయో కూడా చర్చించినట్లు సమాచారం. గంటకు పైగా జరిగిన సమావేశంలో కీలక అంశాలు చర్చకు వచ్చాయి.